సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర నిరసన



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



సత్యం టాకీస్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బంజారాహిల్స్/అమీర్‌పేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ నాయకులు ఫిలింనగర్ గౌతమ్‌నగర్ చౌరస్తాలో బుధవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందూ దేవతలపై ఉద్దేశ్య పూర్వకంగానే సీఎం వ్యాఖ్యలు చేశారని నాయకులు ఆరోపించారు. అధిష్ఠానం మెప్పుకోసం ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి దేవతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటస్వామి, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బీజేవైఎం సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు గందె అరుణ్ కుమార్, సీతల అనిల్ కుమార్, గిరి, బోయ రామాంజనేయులు, గుంటి ఆనంద్‌సాగర్, మల్లికార్జున్‌గౌడ్, ముద్దంగుల రాజు, మారెమ్మ, లక్ష్మక్క, పద్మ, పారిజాతం పాల్గొన్నారు.

● అమీర్‌పేట సత్యం టాకీస్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కేతినేని సరళ మాట్లాడుతూ పెళ్లికాని హన్మంతుడికి మొక్కడం, ఉత్సవ విగ్రహాలుగా ఉన్న ఎల్లమ్మ, పోచమ్మలకు కోళ్లు, గొర్రెలు కోసి మొక్కులు చెల్లించడం ఎంత వరకు సమంజసమని రేవంత్‌రెడ్డి మాట్లాడడం హిందువుల మనోభావాలను కించపరచడమేనన్నారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, నెమలి ఆనంద్, దయానంద్, ఆర్.లక్ష్మణ్, విజ్జిలాల్, నరేష్, కొత్తపల్లి రాజుగౌడ్, దశరథ్‌గౌడ్, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నవీన్ యాదవ్

బోరబండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్ హెచ్.ఎఫ్.నగర్ ఫేజ్-2 మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశం అం దించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. క్రీస్తు బోధనల ప్రకారం ప్రజలందరూ నడుచుకుంటే సర్వ మానవ సౌభ్రాతృత్వం ఏర్పడుతుందని తెలిపారు. ఇండిపెండెంట్ పాస్టర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ని ర్వహించిన వేడుకల్లో పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిస్తే మరిన్ని అద్భుతాలు

● ఎమ్మెల్యే నవీన్ యాదవ్



అవగాహన నడకను ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రోత్స హిస్తే మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారని, ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ రంగాల్లో కూడా వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్(మిష్), రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ సంయుక్తంగా కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు అవగాహన నడకను నిర్వహించారు. ఈ అవగాహన వాక్‌ను ప్రారంభించిన నవీన్ యాదవ్ మాట్లాడుతూ సాధారణ వ్యక్తులతో పాటు సమాన అవకాశాలను దివ్యాంగులకు సైతం కల్పించాలని కోరారు. మిష్ వ్యవస్థాపకురాలు సునీత జి.కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను సమాజంలో తక్కువ చేసి చూడవద్దని, వారికి కూడా సమాన హక్కులు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మిష్ విద్యార్థులు, వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఆడియాలజీ విద్యార్థులు, మిష్ అధ్యాపకులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్వాములు

వైభవంగా అయ్యప్ప పడిపూజ

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లోని వినాయక నగర్ పర్వతాంజనేయస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం కె.పురుషోత్తం గురుస్వామి ఆధ్వర్యంలో 18వ పడిపూజా మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. భజన పాటలు, భక్తిగీతాలు ఆలపిస్తూ అయ్యప్పస్వాములతో పాటు వినాయకనగర్ బస్తీవాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సన్నిధానం గురుస్వాములు బాబురావు, రామకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఆయుర్వేద ప్రముఖులు

ఆయుష్ అధ్యాపక అధికార ఫోరం నూతన కార్యవర్గం

ఎర్రగడ్డ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ అధ్యాపక అధికార ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారులు డాక్టర్ పి.శ్రీరామ్‌రెడ్డి, డాక్టర్ కె.రామారావు ప్రకటించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.ఉమాశ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.సుజాత, డాక్టర్ ఎన్.నరసింహ, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ సిహెచ్.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్‌జేబీ బొకోరి, సంయుక్త కార్యదర్శులుగా జి.వెంకటేశ్వర్లు, లలితమీరా, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.పార్థసారథి, కోశాధికారిగా డాక్టర్ వి.నరసింహ, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ శ్రీకృష్ణ, సంధ్య, సందీప, సుబ్బారావు, లక్ష్మీకాంతం, సబిత గెలుపొందినట్లు వారు ప్రకటించారు.



నీటిలో తడుస్తున్న రైతులు తెచ్చిన ఉల్లి గడ్డ బస్తాలు

ఉల్లి పంట తడుస్తున్నా పట్టించుకోరా?

● మలక్‌పేట మార్కెట్‌లో రోడ్లపై పారుతున్న నీరు

ఓల్డ్‌మలక్‌పేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో వరద సమస్య నిత్యకృత్యమైంది. తరచూ మంచినీటి పైపులు, డ్రైనేజీ పైపులైన్లు మ్యాన్ హోల్స్ పగిలిపోయి నీరంతా మార్కెట్‌లో ప్రవహిస్తోంది. బుధవారం మార్కెట్‌లో పైన ఉన్న మహబూబ్ మాన్షన్ నుంచి మంచినీటి పైపులైన్ పగిలి నీరంతా మార్కెట్‌లో ప్రధాన రోడ్డులో ప్రవహిస్తుంది. దీంతో రైతులు అమ్ముకోవడానికి తెచ్చిన ఉల్లిగడ్డ బస్తాలు వరద నీటిలో తడుస్తున్నాయి. మార్కెట్ అధికారులు ఈసమస్యను పలు మార్లు వాటర్‌వర్క్స్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా పరిష్కారానికి నోచుకోవడం లేదని, పైపులైన్ మరమ్మతు పనులు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి మార్కెట్‌లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

వినికిడి లోపంతో బాధపడుతున్న బాలుడికి సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపంతో బాధపడుతున్న బాలుడికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందింది. వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ గౌరీశంకర్‌కాలనీకి చెందిన మాస్టర్ సపావత్ వరిత్‌వరన్‌కు పుట్టుకతో వినికిడి లోపం ఉంది. వైద్యులు కాంక్లియార్ ప్లాంట్ అమర్చాలని సూచించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి కాంక్లియార్ ప్లాంట్ అమర్చేలా చేశారు. అంతేగాకుండా సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థి సహాయం అందేలా చేశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, సీనియర్ నాయకుడు రామన్‌గౌడ్ బాలుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

కోహీర్‌లో దర్గా ఉర్సు ఉత్సవాలు



ఉర్సు ఉత్సవాల ఆహ్వానపత్రికను విడుదల చేస్తున్న దర్గా ప్రతినిధులు

బోరబండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోహీర్‌లోని హజరత్ మౌలానా మొయినుద్దీన్ తుర్కీ చిష్తీ దర్గా 767వ ఉర్సు ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ప్రతినిధులు తెలిపారు. ఉర్సు ఉత్సవాల ఆహ్వానపత్రికను శ్రీరామ్‌నగర్‌లో బుధవారం వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివారం సర్కారీ సందల్, సోమవారం ఉదయం జల్సే సీరత్-ఎ-ఔలియా, అనంతరం ఖవ్వాలీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు హీరామన్ సందల్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఉర్సు ఉత్సవాల మూడవరోజు మంగళవారం ఉదయం చిరాగా(దీపారాధన), మధ్యాహ్నం 3 గంటలకు కుస్తీ పోటీలు, ఖవ్వాలీ పోటీలు కొనసాగుతాయని వెల్లడించారు. దర్గా ప్రాంగణంలో మంగళవారం రాత్రి జల్సే సీరత్ ఎ ఔలియా కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సోఫీ మహ్మద్ హబీబ్ ఆలం, ముతవల్లి జావీద్ ఖాద్రి, సయ్యద్ మేరాజ్అలీ పటేల్, ఎం.డి.హఫీజ్ జునైదీ, నసీర్ యాబా జునైదీ, రహీం ఖురేషి పాల్గొన్నారు.

ప్రారంభ దశలో ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్స సాధ్యం



మాట్లాడుతున్న డాక్టర్ విజయానంద్‌రెడ్డి, డాక్టర్ భరద్వాజ్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో కనుగొంటే చికిత్స సాధ్యమవుతుందని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ అపోలో క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రొస్టేట్ క్యాన్సర్‌పై 'టేమ్ ద ఫైర్!' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఫైర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్ మాన్ మాట్లాడుతూ 50 సంవత్సరాల పై బడిన పురుషులు ప్రొస్టేట్ క్యాన్సర్ విషయంలో అవగాహన పెంచుకోవాలన్నారు. డాక్టర్ విజయానంద్ రెడ్డి మాట్లాడుతూ ప్రొస్టేట్ క్యాన్సర్ సైలెంట్ కిల్లర్‌గా మారిందన్నారు. అపోలో కాన్సర్ సెంటర్ వైద్య నిపుణులు మాట్లాడుతూ డా.సంజయ్ కుమార్ అద్దల మాట్లాడుతూ ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నిర్ధారణ చేసుకునేందుకు కొన్ని కచ్చితమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ప్రొస్టేట్ క్యాన్సర్‌ను జయించిన పలువురు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అపోలో రీజనల్ సీఈవో తేజస్వీ వీరవల్లి, డాక్టర్ అశ్విన్, డా.ఎస్.వి.ఎస్.ఎస్.ప్రసాద్, డా.నిఖిల్ సురేష్ ఘడియపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి కళాశాలలో వ్యవసాయ విద్యా దినోత్సవం



ప్రదర్శనలను తిలకిస్తున్న వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తదితరులు

రాజేంద్రనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను వ్యవసాయ రంగంవైపు ఆకర్షించడానికి వ్యవసాయ విద్యా దినోత్సవం దోహదపడుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని బుధవారం వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యవసాయ విద్య, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చేపడుతున్న విద్యా, పరిశోధన, విస్తరణ రంగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, డీన్ అగ్రికల్చర్ డాక్టర్ కె ఝాన్సీరాణి, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ కె బి ఈశ్వరీ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్, వివిధ విభాగాల అధిపతులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం ముగింపు ఉత్సవాలు 6న

బర్కత్‌పుర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం ముగింపు ఉత్సవాలను ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నామని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఆబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద ప్రత్యేక అతిథిగా పాల్గొంటారని తెలిపారు.



మంత్రి అజారుద్దీన్‌ను సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, రాష్ట్ర ఎస్టీ విభాగం కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్, ఎర్రగడ్డ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలు యాకమ్మ, నాయకులు కుమారి, ఉమా, దూడల మధుగౌడ్, రఘునాయక్ తదితరులు

● ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి



శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగార్జునరెడ్డి, వెంకటేశ్వరరావు, శంకర్ ముదిరాజ్, సత్యనారాయణ, తదితరులు

అమరుల త్యాగఫలమే ప్రత్యేక రాష్ట్రం

పంజాగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగ ఫలమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అని కాంగ్రెస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. సామాజిక కార్యకర్త దండు సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం మధురానగర్ కాలనీలో తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని జవహర్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నెల్లి శంకర్ ముదిరాజ్ అన్నారు. కార్యక్రమంలో వెంగళరావునగర్ కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిత్యరెడ్డి, తదితరులు

ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

పంజాగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్(ఏఐపీసీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.ఆదిత్యరెడ్డి అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఏఐపీసీ కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంస్థ అని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ నేతృత్వంలో పనిచేస్తామని, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడానికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో పనిచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు మెండు శ్రీనివాసులు, సందీప్ భూషణ్, ఉన్నం సుబ్బారావు, నితిజ్ఞ హర్కారా, శశాంక్, మరియా.టి.కవితారెడ్డి, సంతోష్, క్వీన్ విక్టోరియా, భరత్ రెడ్డి, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, సృజనారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ పీఈఐటీహెచ్, అరోరా కాలనీ ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ సీ-బ్లాక్, వెంకటేశ్వరహిల్స్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ ఎల్.వి.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ అవంతి నగర్, బేగంపేట ప్రభుత్వ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ కార్మిక నగర్, మెథడిస్ట్ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

సచిన్ సావంత్‌ను కలిసిన బండి



ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌ను బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీని బలోపేతం చేయడంపై చర్చించారు.

- కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

కంటోన్మెంట్ సీఈఓతో శ్రీగణేశ్ సమావేశం

సికింద్రాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి అర్వింద్‌కుమార్ ద్వివేదీతో స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ బుధవారం సమావేశమయ్యారు. బస్తీల పర్యటన సందర్భంగా తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించారు. పదో తేదీన నిర్వహించనున్న ప్రజావాణిలో పాల్గొనాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులు స్వీకరించి, సత్వరమే పరిష్కరించాలని కోరారు.


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సీతాఫల్‌మండీలో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో ఇందిరానగర్‌కాలనీ, వీరయ్యగల్లీలలో సోమవారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న డ్రైనేజీ మట్టి పూడికతీత పనులను పరిశీలించిన అనంతరం బస్తీవాసులను స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ పద్మలత, ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్ కుశాల్, బీఆర్ఎస్ నాయకుడు మేడిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.


సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

అయ్యప్ప స్వాముల సైకిల్ యాత్ర

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన గురుస్వామి యామ ప్రశాంత్ ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష తీసుకున్న పలువురు స్వాములు సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డులోని మావురాల పెద్దమ్మ గుడిలో ఇరుముడి కట్టుకుని ఆలయం నుంచి శబరిమలకు బుధవారం సైకిళ్లపై యాత్రకు బయలు దేరారు. ఈ యాత్రను మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైకిళ్లపై శబరికి వెళుతున్న స్వాములు క్షేమంగా వెళ్లి స్వామి ఆశీర్వాదంతో రావాలని స్వామిని కోరుకుంటున్నానన్నారు. దాదాపు 15 రోజులు సాగే ఈ యాత్రలో గురుస్వాములు రమేష్, శరత్‌బాబు, సాయి ప్రసాద్, కత్తి స్వామి త్రయంబకేశ్వర్, కన్నెస్వామి ప్రశాంత్‌లు బయలుదేరారు.

డీలర్‌షిప్‌లు ఇస్తానని మోసం

దాదాపు రూ.30 లక్షలు వసూలు చేసిన నిందితుడి అరెస్ట్, రిమాండ్

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డీలర్‌షిప్‌లు ఇస్తానని కొందరి నుంచి దాదాపు రూ.30 లక్షలు వసూలు చేసిన నిందితుడిని అరెస్ట్ చేసిన మహంకాళి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మహంకాళి ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం బార్కాస్‌కు చెందిన సయ్యదుద్దీన్ ఓమర్ బల్వావల్ సికింద్రాబాద్ వద్ద గల చంద్రలోక్ కాంప్లెక్స్‌లో సంవత్సరకాలంగా బుక్ మై షిప్ పేరిట నిర్వహిస్తున్న ఈకామర్స్ వ్యాపారంలో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు. దీని ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. కాగా నిందితుడు తెలంగాణ, ఏపీ, కర్నాటక రాష్ట్రాల్లో డీలర్‌షిప్‌లు ఇస్తానని పలువురి నుంచి దాదాపు రూ.30 లక్షలు వసూలు చేశాడు. ఎంతకీ డీలర్‌షిప్‌లను ఇవ్వకపోవడంతో 26 మంది బాధితులు మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సెక్షన్ 420, 420/6 కింద కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ బుక్ మై షిప్ వ్యాపారంలో ఎవరైనా బాధితులు డబ్బులు పెట్టి మోసపోయి ఉంటే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ కోరారు.


కంటైనర్‌ను తొలగిస్తున్న కంటోన్మెంట్ సిబ్బంది

వైన్స్‌షాపు కంటైనర్ తొలగింపు

తిరుమలగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు చిన్నకమేల వద్ద వైన్స్‌షాపు కోసం ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించాలని బస్తీవాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించడంతో కంటోన్మెంట్ అధికారులు తొలగించారు. అంతకుముందు వైన్స్‌షాపుకు వ్యతిరేకంగా ఎక్సైజ్, కంటోన్మెంట్, పోలీసులకు వినతిపత్రాలు సమర్పించారు. స్పందించిన అధికారులు కంటైనర్‌ను తొలగించి మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో పెట్టారు. దీంతో బస్తీ యూత్, మహిళలు సంబరాలు జరుపుకున్నారు.

రోడ్లపై పశువులు.. ట్రాఫిక్‌కు తిప్పలు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు




బోయినపల్లి, బాపూజీనగర్ రోడ్లపై సంచరిస్తున్న పశువులు

బోయినపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లిలోని ప్రధాన రహదారుల్లో పశువుల సంచారం ఎక్కువైంది. మందలు మందలుగా తిరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నది. ట్రాఫిక్ పోలీసులు వాటిని అదుపు చేస్తున్నా.. మరుసటి రోజు అలాగే రోడ్ల పైకి చేరుతున్నాయి. ఇప్పటికే అధికారుల నిర్లక్ష్య వైఖరితో కంటోన్మెంట్ స్మార్ట్ సిటీ క్రమంగా డ్రైన్ సిటీగా మారుతుండగా, మరోవైపు పెరుగుతున్న వాహనాలకు తోడు రోడ్లపై తిరుగుతున్న పశువుల కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చుతున్నది. దీంతో వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా బాపూజీనగర్ బోయినపల్లి మార్కెట్ యార్డ్, వీఆర్ ఆస్పత్రి, శ్రీలత గార్డెన్ చౌరాస్తాలతో పాటు ప్రధాన చౌరాస్తాల వద్ద పశువులు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై సంచరిస్తుండటంతో పలువురు వాహనదారులు గమనించక వాటిని ఢీకొట్టి గాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి. అలాగే కూరగాయల మార్కెట్, అటు డైమండ్ పాయింట్, తిరుమలగిరి వైపునకు వెళ్లే దారుల్లో సంచరిస్తుండటంతో రైతులు, విక్రయదారులు, కొనుగోలుదారులు, వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. అసలే నిత్యం ట్రాఫిక్ నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసులు తిప్పలు పడుతుంటారు. ఈ పరిస్థితుల్లో ఈ పశువుల గోడు పోలీసులకు సమస్యగా మారుతున్నది. సంబంధిత అధికారులు కూడా స్పందించి ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ ప్రజలు చేస్తున్నారు. అయితే పశువుల యజమానులు వాటిని తమ సొంత స్థలాల్లో ఉంచితే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. ఈ సందర్భంగా పశువులను సొంత స్థలాలకు తరలించుకోవాలని, లేదంటే ఆలయ గోశాలకు తరలిస్తామని ట్రాఫిక్ పోలీసులు సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు చేపట్టాలి



గతంలో అధికారులు ప్రకటన విడుదల చేసినా స్పందన కరువైంది. సమస్య లాగే ఉండిపోయింది. అధికారులు సమస్యను గాలికి వదిలేస్తున్నారు. ప్రమాదాలు సంభవించకముందే ఇప్పటికైనా చర్యలు చేపట్టాలి.

- శ్రీకాంత్ రాజ్, బోయినపల్లి

గోశాలలకు తరలిస్తాం



పశువులను సొంత స్థలాలకు తరలించుకోవాలని లేదంటే గోశాలకు తరలించాల్సి వస్తుంది. పలుమార్లు సంబంధిత యాజమానులు హెచ్చరించాం. అయినా అదే పరిస్థితి ఉంది. అధికారులతో చర్చించి పశువుల యాజమానులకు జరిమానాలు విధిస్తాం.

- విజయ్‌కాంత్, ట్రాఫిక్ ఎస్ఐ

మురుగు ప్రవాహానికి శాశ్వత పరిష్కారం : తలసాని


అధికారులతో కలిసి సమస్యను పరిశీలిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. పద్మారావునగర్‌లోని ప్రధానరోడ్లపై నిత్యం మురుగు ప్రవహిస్తుండటంతో కాలనీ వాసులు, అపార్టుమెంటు వాసులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన బుధవారం గాంధీ ఆస్పత్రి వెనక వైపున రోడ్డు పక్కన ఉన్న ఓపెన్ నాలాను పరిశీలించి సమస్య విషయమై స్థానికులను, అధికారులను అడిగి తెలుసుకొన్నారు. డ్రైనేజీ, స్ట్రామ్ వాటర్‌లకు కలిపి ఒకటే లైను ఉండటం వల్ల మ్యాన్‌హోల్ పొంగి రోడ్లపైకి నీరు చేరుతోందని అధికారులు వివరించారు. పద్మారావునగర్ పార్క్ నుంచి పల్స్ హాస్పిటల్ వరకు డ్రైనేజీ స్ట్రామ్ లైన్లకు వేర్వేరుగా నూతన లైన్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను తలసాని ఆదేశించారు. ఓపెన్ నాలాలో చెత్త ఇతర వ్యర్థాలు వేయటం వల్ల సమస్యలు ఏర్పడతాయని కాలనీ వాసులకు సూచించారు. అదేవిధంగా ఓపెన్ నాలాకు నూతన జాలీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభినవనగర్ కాలనీలో నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని,వెంకటాపురం కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌పై ఫస్ట్ ఫ్లోర్ నిర్మించాలని కాలనీ వాసులు కోరగా,ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తలసాని వెంట డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, జలమండలి జీఎం వినోద్, బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, నాయకులు వెంకటేశన్‌రాజు, బాల్‌రెడ్డి, చక్రధర్, కృష్ణారావు, డాక్టర్.రమేశ్, జగ్గయ్య, ఏసూరి మహేశ్, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీపతి, మహేందర్, అంబులెన్స్ సురేశ్ తదితరులు ఉన్నారు.


తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న అధికారులు, సిబ్బంది

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బోయినపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సెంటర్ పాయింట్ ప్రధాన రహదారిలో తాగునీటి పైప్‌లైన్ లీక్‌పై తాగునీరు రోడ్డుపాలు అని ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనానికి అధికారులు స్పందించారు. కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు పరిధిలోని సెంటర్ పాయింట్ వద్ద తాగునీటి మెయిన్ పైపులైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా పోతుంది. ఐదు రోజులుగా రహదారిలో నీరు పరుగులు తీస్తున్న పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన మిలిటరీ అధికారులు, వాటర్‌వర్క్స్ అధికారులు, సిబ్బంది బుధవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి వృథా అవుతున్న తాగునీటిని అదుపు చేశారు. దీంతో స్థానిక వ్యాపారస్తులు, మాజీ బోర్డు సభ్యులు పలువురు ప్రజా ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూలో మూడు జాతీయ కార్యక్రమాలు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న మూడు జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాల బ్రోచర్లు, పోస్టర్లను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం బుధవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 5న జరగనున్న పోటీ పరీక్షల ఉచిత ఓరియంటేషన్ సెమినార్ ద్వారా విద్యార్థులు తాజా పరీక్ష ధోరణులపై అవగాహన కల్పించనున్నారు. డిసెంబర్ 18, 19 తేదీల్లో ఏరోస్పేస్ ఆధునిక తయారీ సాంకేతికతల జాతీయ సెమినార్ జరగనుంది.


ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు


దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ త్రినాథ్

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మారేడుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం మా భవిత సెంటర్ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారేడుపల్లి లైన్స్ క్లబ్ లయన్ సత్యనారాయణ, లయన్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సెంటర్ ప్రధాన ఉపాధ్యాయురాలు లీలావతి, ప్రత్యేక శిక్షకురాలు ఈ. సుధా మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో

అడ్డగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ప్రభుత్వం అందించే పథకాల గురించి తెలుసుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ త్రినాథ్ తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీ హాలులో జరిగిన దివ్యాంగుల సాధికారత కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వికాస్ రిసోర్స్ పర్సన్ విజయలక్ష్మి, టివిఎస్ సంఘం అధ్యక్షురాలు దయామణి, సరిత, కళాజ్యోతి, మాధవి, వాణి, రేణుకలు పాల్గొన్నారు.

ఓయూలో విదేశీ విద్యార్థులతో ముఖాముఖి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అఫైర్స్ కార్యాలయంలో బుధవారం ఐసీసీఆర్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ విదేశీ విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌ల విడుదల, కోర్సు మార్పులు, స్కిల్ ఒరియెంటేషన్ క్లాసులు, ఇంగ్లిష్, అరబిక్, ఫ్రెంచ్ వంటి భాషా బోధనపై వచ్చిన అభ్యర్థనలకు ఆయ న సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్, మెయిల్ ద్వారా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఓఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. విజయ విద్యార్థుల ప్రధాన సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


అధికారులకు సమస్యలు వివరిస్తున్న విద్యార్థులు

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా : ఎమ్మెల్యే మర్రి

మచ్చబొల్లారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం డివిజన్ సాయి నగర్ కాలనీలో రూ.25 లక్షలు, హనుమాన్ టెక్డిలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సాంబయ్య, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, శోభన్ బాబు, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, అరుణ్, కాలనీ వాసులు రాజు, ఉమ శ్రీనివాస్, జ్యోతి స్వరూప, సులోచన పాల్గొన్నారు.

ఓయూలో పోటీ పరీక్షలపై శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని హెచ్‌సీడీసీ నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు మూడు రోజుల సర్టిఫికెట్ ట్రైనింగ్ కార్యక్రమం సీఎఫ్ఆర్‌డీ భవనంలో గురువారం ప్రారంభమైంది. గేట్, యూపీఎస్సీ, క్యాట్/మ్యాట్ రాష్ట్ర స్థాయి పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన వ్యూహాలు, టెక్నిక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయచరణ్, కోఆర్డినేటర్ డా.యూ.సూర్యవల్లి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


బస్తీబాటలో భాగంగా మాణికేశ్వర్‌నగర్‌లో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి అన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్ని శాఖల అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్, పార్థివాడలో పర్యటించారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ కేటాయించిన రూ.2 కోట్ల నిధులను బస్తీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టడం జరిగిందని అన్నారు. ఈ నిధులు పారదర్శకతతో పాటు, అత్యవసర అవసరాలను బట్టి ఖర్చు చేయాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు గండికోట కుమార్, బోదాసు నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.


మాస్కులు, మంకీ క్యాప్‌లు అందజేస్తున్న కరణ్ సింగ్, జంపన ప్రతాప్

కార్మికులకు మాస్కులు, మంకీ క్యాప్‌లు పంపిణీ

బోయినపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అఖిల భారతీయ సఫాయ్ కాంఘర్ సంఘటన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కరణ్‌సింగ్ ఆధ్వర్యంలో బోయినపల్లి సర్కిల్ కార్యాలయం పరిధిలో పారిశుధ్య కార్మికులకు మంకీ క్యాప్‌లు, మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై 60 మంది కార్మికులకు మంకీ క్యాప్‌లు, మాస్కులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వినోద్ సింగ్, మార్నింగ్ వాకర్‌లు సాయిబాబా యాదవ్, సత్యనారాయణ, బండి శ్రీను, యాదగిరి, జంపన రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య


భిక్షపతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి రైలుకింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన పారేదుల భిక్షపతి(45) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులకు తోడు మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద ఎదురుగా వచ్చిన రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సీఎం వ్యాఖ్యలపై నిరసనలు

● ప్లకార్డులతో ఆందోళన చేసిన బీజేపీ శ్రేణులు

మారేడుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా హిందూ దేవుళ్లపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మదా మల్లికార్జున, డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు బుధవారం పికెట్ జేబీఎస్ చౌరాస్తాలో కంటోన్మెంట్ బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్లకార్డులను ప్రదర్శిస్తూ, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పే వరకు ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుక మల్లికార్జున, టోపీ శంకర్, విజయానంద్, సతీష్ కిరణ్, మల్లేష్, సచిన్, ప్రశాంత్ టింకు, ప్రభాకర్, రాజు, అరుణ్, చంద్రశేఖర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్‌లో..

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవతలను, హైందవ ధర్మంపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై భారతీయ జనతాపార్టీ తరఫున రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, మోండా డివిజన్లకు చెందిన ఆ పార్టీ శ్రేణులు బుధవారం సికింద్రాబాద్ ప్యారడైజ్ చౌరస్తా వద్ద సీఎం దిష్టి బొమ్మ దహనానికి ప్రయత్నించారు. కాగా ఆ ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకుని దిష్టి బొమ్మను లాక్కుని నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రవణ్ కుమార్, రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు భవర్‌లాల్ సందీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి అనీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో..

తార్నాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను అవమానపరుస్తూ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని హిందూ సమాజానికి వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకా రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు తార్నాక చౌరాస్తాలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. అంతకుముందు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించడంతో ఓయూ పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు రవి ప్రసాద్ గౌడ్, పోచయ్య యాదవ్, వీరన్న, వెంకటేశ్ గౌడ్, ఉపేందర్, నరేష్, హరి, అనిత, శారద మల్లేష్, సౌందర్య పాల్గొన్నారు.


జేబీఎస్ చౌరాస్తాలో బైఠాయించి భక్తి గేయాలను ఆలపిస్తున్న నామినేటెడ్ మెంబర్ భానుకా నర్మద, కార్పొరేటర్ కొంతం దీపిక


ధర్నా చేస్తున్న భారతీయ జనతా పార్టీ శ్రేణులు


తార్నాక చౌరాస్తాలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు